వైఎస్సార్ సీపీ విజయం తథ్యం

- సంక్షేమ పథకాల అమలులో రికార్డు
- ఎంపీ బోస్, కోఆర్డినేటర్ సూర్యప్రకాష్



పట్టణంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎంపీ బోస్, కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ తదితరులు

రామచంద్రపురం: గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో పేదలకు సంక్షేమ పథకాలను అందించడంలో వైఎస్సార్ సీపీ రికార్డు సృష్టించిందని, పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ అన్నారు. పట్టణంలోని 24వ వార్డు కుమ్మర్ల వీధిలో శనివారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా జరిగిన లబ్ధిని వివరిస్తూ రాబోయే రోజుల్లో కూడా ఈ విధమైన సంక్షేమ పథకాలు అందాలంటే సీఎంగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో విద్య, వైద్యం, మహిళల ఆర్థికాభివృద్ధి వంటి విషయాల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద పీట వేసిందన్నారు. పేద విద్యార్థులు కూడా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం అభ్యసించే విధంగా చర్యలు తీసుకుందన్నారు. వైద్య రంగంలో ప్రతి ఇంటికి వెళ్లి వారి ఆరోగ్య విషయాలను తెలుసుకునేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సీఎం జగన్ ప్రవేశపెట్టారన్నారు. ఇన్ని సంక్షేమ పథకాలు అమలు చేసిన జగన్‌మోహన్‌రెడ్డిని మరలా సీఎంను చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కో ఆర్డినేటర్ సూర్యప్రకాష్ మాట్లాడుతూ ప్రతి పేదకుటుంబం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సుభిక్షంగా ఉన్నారన్నారు. పేదవారు అభివృద్ధి చెందుతుంటే ఓర్వలేని ప్రతిపక్షాలు తిరిగి అవే సంక్షేమ పథకాలు అమలు చేస్తాం అంటూ మరోసారి మోసం చేసేందుకు కలసికట్టుగా వస్తున్నారని విమర్శించారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లుగా పాలన సాగించిందని తిరిగి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఈ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా తీసుకురావడం ఎంతైనా అవసరం ఉందని సూర్యప్రకాష్ పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు చింతలపాటి శ్రీనివాసరాజు ముఖ్యఅతిథిగా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, స్థానిక వార్డు కౌన్సిలర్ బొక్కా సత్యనారాయణ, వైస్ చైర్మన్ కోలమూరి శివాజీ, కౌన్సిలర్‌లు కేతా శ్రీను, వాడ్రేవు సాయిప్రసాద్, బాసిన నాగమణి, నల్లా అంజమ్మ, పట్టణ కన్వీనర్ గాధంశెట్టి శ్రీధర్, నాయకులు కొయ్యా బంగారుబాబు, సత్తిశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలో ప్రతి అంశం చరిత్ర లిఖితమే



గొల్లపాలెంలో కార్యకర్తలు, ప్రజలకు పథకాలు వివరిస్తున్న రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోని ప్రతి అంశం చరిత్ర లిఖితమౌతుందని రాజ్యసభ సభ్యులు (ఎంపీ) పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. శనివారం మండలంలోని గొల్లపాలెం తదితర గ్రామాల్లో సుభాష్‌చంద్రబోస్ పర్యటించి నాయకులు, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఎందరో ముఖ్యమంత్రులు వచ్చారని అయితే ఇంత భారీ ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఒక్క జగనన్నకే దక్కుతుందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పలు పథకాలను దేశంలోని ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు. జగనన్న పథకాలు రాష్ట్ర చరిత్రలో గుర్తుండిపోతుందన్నారు. ప్రజలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకునేలా కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్థానిక మాజీ సర్పంచ్ కొప్పుల సత్యనారాయణ, ఎంపీటీసీ జొన్నకూటి పద్మజ, పీఏసీఎస్ చైర్మన్ సత్తి శ్రీరామారెడ్డి, మండల ఎస్సీ సెల్ కన్వీనర్ పోలినాటి సూర్యచంద్రం, పార్టీ మండల సేవాదళ్ కన్వీనర్ టేకుమూడి దుర్గారావు, రేఖపల్లి సత్తిబాబు, దండంగి చిన్నారావు, పాలిక వీరబాబు, చొల్లంగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మొదటి జీతం నిత్యాన్నదానానికి..



ద్రాక్షారామ భీమేశ్వరాలయ ఈఓకు విరాళం అందజేస్తున్న తేజస్విని

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్నాయిపేట సర్పంచ్ పెమ్మిరెడ్డి దొరబాబు కుమార్తె తేజస్విని (సాఫ్ట్‌వేర్ ఇంజినీర్) తన మొదటి జీతంలో రూ.10 వేలు ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదానానికి విరాళంగా ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావుకు అందజేసింది. అదే విధంగా కందులపాలెం వేంకటేశ్వర స్వామి దేవాలయానికి మరో రూ.10 వేలు అందజేసింది. కార్యక్రమంలో తండ్రి దొరబాబు, అన్నయ్య సూర్యనారాయణ(నాని), బోనం బుజ్జి పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు 144 సెక్షన్ అమలు

కపిలేశ్వరపురం: గ్రూప్–2 పరీక్ష ఆది, సోమవారాల్లో జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్టు అంగర ఎస్సై అందే పరదేశీ శనివారం తెలిపారు. రామచంద్రపురం డివిజన్ పరిధిలోని కపిలేశ్వరపురం, మండపేట, రాయవరం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకూ రెండు విడతలుగా పరీక్షలను నిర్వహిస్తున్నారన్నారు. ఆయా మండలాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు నిబంధనలు మేరకు నడచుకుని సహకరించాలన్నారు.

గరుడ వాహనంపై ఊరేగిన స్వామివారు



సోమేశ్వరంలో వేణుగోపాలస్వామి ఊరేగింపు

రాయవరం: సోమేశ్వరంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి గ్రామోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. గరుడ వాహనంపై స్వామివారు, దేవేర్లను భక్తులు ఊరేగించారు. ఊరేగింపు సమయంలో ప్రత్యేక అలంకరణలో స్వామివారు, దేవేర్లు కనువిందు చేశారు. ఆలయంలో ప్రధాన అర్చకులు పెద్దింటి వెంకటనారాయణాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిఫ్, ఎంపీటీసీ కాళ్ల అప్పారావు, దేవస్థానం చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఆలయ ఈవో బాలాజీరామ్‌ప్రసాద్, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


సత్తెమ్మతల్లి తీర్థానికి ఏర్పాట్లు పూర్తి



గొల్లపాలెంలో తీర్థమహోత్సవాలకు సిద్ధమవుతున్న సత్తెమ్మతల్లి ఆలయం

కాజులూరు: గొల్లపాలెం శివారు గుండారం కాలనీలో ఆదివారం దేవత సత్తెమ్మతల్లి తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహక కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో భాగంగా శనివారం రాత్రి గ్రామంలో గరగనృత్యాలతో జాతర నిర్వహించిన భక్తులు ఆదివారం తెల్లవారు జాము నుంచి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పరిసర గ్రామాల నుంచి అమ్మవారి దర్శనార్థం, మెక్కులు తీర్చుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థ కమిటీ సభ్యులు తగిన వసతి ఏర్పాట్లు చేసారు. మధ్యాహ్నం పలువురి దాతల సహకారంతో ఆలయం వద్ద భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

జిల్లా వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా గోవిందరాజు



కె.గంగవరం: మండలంలోని గుడిగళ్ల భాగ గ్రామానికి చెందిన ద్రాక్షారామ మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు పార్టీ జిల్లా వాణిజ్య విభాగం జనరల్ సెక్రటరీగా పండు గోవిందరాజు నియమితులయ్యారు. ఈయన నేడు (ఆదివారం) జిల్లా కేంద్రమైన అమలాపురంలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. జనరల్ సెక్రటరీగా ఎంపికవడంపై పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యుడు బత్తుల అప్పారావు, సచివాలయ మండల కన్వీనర్ తోకల శ్రీను, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, ఎంపీపీ పంపన నాగమణి, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు గోవిందరాజును అభినందించారు.

ఒత్తిడి లేకుండా శ్రద్ధగా చదవాలి



విద్యార్థులకు పరీక్ష అట్టలు అందిస్తున్న మూర్తి

రాజోలు: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఎలాంటి ఒత్తిడి లేకుండా శ్రద్ధగా చదవాలని మాజీ ఐఆర్ఎస్ అధికారి తాళ్ల సత్యనారాయణమూర్తి అన్నారు. శనివారం శివకోడులో గురుకుల బాలిక పాఠశాలను ఆయన సందర్శించారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు 80 మందికి సరస్వతి ముత్యాలు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు, పెన్నులు అందజేశారు. ఉన్నత విద్యను అభ్యసించేందుకు పదో తరగతి పబ్లిక్ పరీక్ష తొలిమెట్టు అన్నారు. నాయకులు గునిశెట్టి చినబాబు, నాతి శ్రీనివాసరావు, తాళ్ల సాంబమూర్తి, బొంతు శ్రీను, నెల్లి దుర్గాప్రసాద్, స్టూడియో వర్మ, రావి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

చదవడమే కాదు.. రాయడమూ కీలకమే..

- పరీక్ష రాయడంపై అవగాహన అవసరం
- ప్రణాళికబద్ధంగా చదవాలి
- ఒకటి నుంచి ఇంటర్ పరీక్షలు
- పరీక్ష రాసేతీరుపై ఉపాధ్యాయుల సూచనలు



చదువుకుంటున్న విద్యార్థులు

కపిలేశ్వరపురం: విద్యార్థులు అందమైన దస్తూరి అలవాటు చేసుకోవాలి. దస్తూరి మన తలరాతను మార్చుతుంది. ఎంత కష్టపడి చదివినా పరీక్షలో బాగా రాయకపోతే ఫెయిల్ అయ్యే అవకాశం ఉంటుంది. ఏడాది మొత్తం విన్న పాఠ్యాంశాలను ప్రణాళికబద్ధంగా చదివితే ఫలితం మన వెంటే ఉంటుంది.

ఏడాది కష్టం ఏమాత్రమూ వృథా కాకూడదు. వారం రోజుల పాటు రాసే పరీక్షలే విద్యార్థి తలరాతలను నిర్ధారిస్తాయి. మూడు గంటలపాటు రాసే పరీక్షా సమయాన్ని ప్రణాళికాబద్ధంగా సద్వినియోగం చేసుకోవాలి. అందుకోసం ఓర్పు, నేర్పు ఉండాలి. అంతకంటే ముందు విద్యార్థి మానసికంగా పరీక్షకు సిద్ధంగా ఉండాలి. సామాజిక ప్రతికూల అంశాలకు దూరంగా ఉండగలగాలి.

మార్చి ఒకటో తేదీ నుంచి ఇంటర్మీడియెట్, 18 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈనేపథ్యంలో పరీక్ష రాసే పద్ధతిపై ఉపాధ్యాయలు చేస్తున్న సూచనలు ఇలా...

ప్రశాంతమైన మనసుతో..



రాత వ్యక్తిత్వానికి ప్రతీక అని మానసిక నిపుణులు చెబుతున్నారు. మనస్సులో కలిగే భావాలు ఆధారంగా రాత పొందిక ఉంటుంది. పరీక్ష రాసేటప్పుడు ఒత్తిడికి గురయ్యితే దాని ప్రభావం రాతపై పడుతుంది. అందువల్ల పరీక్ష రాసేటప్పుడు మనస్సు ప్రశాంతంగా ఉంచుకోవాలి. భౌతిక పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. మనస్సుకు బాధ కలిగించే విషయాలకు దూరంగా ఉండాలి.

– డాక్టర్ వాకా దివ్యశేఖర్, అంగర, కపిలేశ్వరపురం మండలం

ఆరోగ్యంపై శ్రద్ధ



విద్యార్థి పరీక్షలు బాగా రాయాలంటే శారీరకంగానూ, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలి. అందుకోసం పరీక్షలపై భయాన్ని పోగొట్టుకోవాలి. ఇప్పటికిప్పుడు కొత్తవి చదివే పని పెట్టుకోకూడదు. అప్పుడప్పుడూ ఒక్కో గ్లాసు చొప్పున రోజుకు 3 లీటర్లు నీరును తాగాలి. పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకోవాలి. జీర్ణమయ్యేందుకు అధిక సమయం పట్టే మాంసాహారం, జంక్ ఫుడ్‌లకు దూరంగా ఉండడం మంచిది.

– డాక్టర్ పి.రత్నకుమారి, వైద్యాధికారి, అంగర పీహెచ్‌సీ

అక్షర దోషాలు లేకుండా..



సమాధాన పత్రంలో రాసే జవాబు సూటిగా ఉండటంతోపాటు అక్షరాలు అందంగా రాయాలి. పేజీపై భాగం, ఎడమ వైపు ఒక అంగుళం మార్జిన్‌ను వదలిపెట్టాలి. తెలుగు అక్షరాలు గుండ్రంగా రాయడం ద్వారా అర్థవంతంగా ఉంటాయి. పదాలు, వాక్యాలు మధ్య తగినంత ఖాళీ ఉండేలా చూసుకోవాలి.

– కణ్వమహర్షి, మేథ్స్ అధ్యాపకులు, పామర్రు, కె.గంగవరం మండలం

వేగంగా రాసేలా..



పరీక్షరాసే సమయాన్ని ప్రణాళికాబద్ధంగా వినియోగించుకోవాలి. రాయాల్సిన ప్రశ్నలెన్ని, పరీక్షా సమయమెంత అన్న అంశాలపై విద్యార్థికి అవగాహన అవసరం. పరిస్థితులెలా ఉన్నప్పటికీ సమయాన్ని వృథా చేసుకోకూడదు. పరిమితికి మించి వేగంగా రాయడం అనర్థం తెస్తుంది. అందుకోసం ఇప్పటి నుంచే రాతను ప్రాక్టీసు చేసుకోవడం మంచిది.

– జువ్వల శ్రీనివాస్, సోషల్ ఉపాధ్యాయులు, వెదురుమూడి

ముందు ప్రశ్నా పత్రాన్ని అర్థం చేసుకోవాలి



పరీక్ష పత్రం ఇచ్చిన వెంటనే సమాధానాలను రాసేయకూడదు. ముందు ప్రశాంతంగా ప్రశ్నా పత్రం మొత్తం చదువుకోవాలి. వాటిలో ఏ ప్రశ్నలకు సమాధానం రాసే నేర్పు ఉందో తెల్సుకుని వాటిని అర్థవంతంగా రావాలి. అందుకోసం అవసరమైతే కొంత సమయాన్ని కేటాయించాలి. అలా సమయాన్ని కేటాయించడం వృథా అనుకోకూడదు.

– రాగం కనకభాస్కరరావు, తెలుగు అధ్యాపకులు, జెడ్పీ ఉన్నత పాఠశాల, వల్లూరు

ఒత్తిడిని తగ్గించుకోవాలి



ఒత్తిడిని దూరం చేసుకుని పరీక్షకు బయలుదేరాలి. పరీక్ష రాసే విద్యార్థి ప్రశ్నా పత్రంలో ఏ ప్రశ్నలుంటాయా అన్న ఆలోచన ఉండకూడదు. అలాంటి ఊహాత్మక ప్రశ్నలు పరీక్ష రాసే తీరుపై రుణాత్మక ప్రభావాన్ని కలిగిస్తుంది. ఇప్పటి వరకూ చదివిన అంశాలపైనే ప్రశ్నలు అడుగుతురన్న ధీమాతో పరీక్ష రాసేందుకు బయలుదేరాలి. ఆ తర్వాత పరీక్షా పత్రాన్ని ప్రశాంతంగా చదువుకుని బాగా రాయగలను అనుకున్న ప్రశ్నలకు సమాధానాలను రాయడం ప్రారంభించాలి.

– జి.సీతారామశర్మ, హెచ్ఎం, మూలస్థానం ఉన్నత పాఠశాల

పేదలకు ఆసరాగా సీఎం జగన్



కేదారిలంకలో లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేస్తున్న పృథ్వీరాజ్, ప్రజా ప్రతినిధులు

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి ప్రజలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆసరాగా నిలిచారని జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ తదితర ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలోని కేదారిలంక, అద్దంకివారిలంక గ్రామాల్లో శనివారం వైఎస్సార్ ఆసరా పథకం లబ్ధిదారులకు నాలుగో విడత రుణమాఫీ సొమ్ము పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు వీధి వెంకటరెడ్డి, సర్పంచ్ నాతి గవరయ్య, ఎంపీటీసీ యర్రంశెట్టి నాగేశ్వరరావు, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొండేటి వెంకటేశ్వరరావు, పోలిశెట్టి గణేష్‌లతో కలిసి లబ్ధిదారులకు నమూనా చెక్‌ను అందజేశారు. ఆయా గ్రామాల్లోని లబ్ధిదారుల వివరాలను కార్యదర్శి సీహెచ్ నరసింహారావు, సచివాలయ ఉద్యోగులు వెల్లడించారు. సర్పంచులు వెంకటరెడ్డి, గవరయ్య అధ్యక్షతన నిర్వహించిన ఆయా గ్రామాల సమావేశాల్లో పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారులకూ ప్రభుత్వం నుంచి సాయమందిందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.

గ్రూపు-2 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి



పరీక్షా కేంద్రంలో ఇన్విజిలేటర్లకు సూచనలిస్తున్న సీఎస్ సునీత

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం గ్రూపు-2 పరీక్ష నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పరీక్షా కేంద్రంలో 432 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. ఇందుకు 18 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. పరీక్షా కేంద్రంలో శనివారం మధ్యాహ్నం పరీక్షా కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ వీఎస్ సునీత ఇన్విజిలేటర్లతో సమావేశాన్ని నిర్వహించారు. పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించాలని సీఎస్ ఇన్విజిలేటర్లకు సూచించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు పరీక్షా కేంద్రం లైజనింగ్ అధికారి కె.ప్రభాకర్ తెలిపారు. పరీక్ష సమయంలో పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. పరీక్షా కేంద్రంలోకి ఉదయం 9.30 గంటల నుంచి అభ్యర్థులను అనుమతిస్తామని, 10.15గంటల తర్వాత ఏ ఒక్కరినీ పరీక్షా కేంద్రంలోకి అనుమతించమని తహసీల్దారు ఆర్‌వీ కృష్ణారావు తెలిపారు. ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్షను నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంపునకు కృషి చేయాలి



భవిత కేంద్రాల ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న సమగ్ర శిక్ష రాష్ట్ర స్థాయి మానిటరింగ్ అధికారి అబ్దుల్ ఘని

రామచంద్రపురం రూరల్: జిల్లాలోని భవిత కేంద్రాల ఉపాధ్యాయులకు రామచంద్రపురం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంఈఓలు మానుపూడి శ్రీనివాస్, వాసంశెట్టి నాగేశ్వరిల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సమగ్ర శిక్ష రాష్ట్ర స్థాయి మానిటరింగ్ అధికారి అబ్దుల్ ఘని హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచాలన్నారు. దివ్యాంగులైన చిన్నారుల ప్రవర్తనలో మార్పులను ఎప్పటికప్పుడు పరిశీలించాన్నారు. దీని ద్వారా వారి ప్రగతికి చేపట్టవలసిన చర్యలు ఉన్నతాధికారుల సూచనల మేరకు చేయాల్సి ఉంటుందని వివరించారు. భవిత కేంద్రాల్లో చదువుతున్న చిన్నారులకు ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని సౌకర్యాలు అందేలా చూడాల్సిన బాధ్యత ఐఈఆర్‌పీలపై ఉందన్నారు. వినికిడి, చూపు సమస్యలు ఉన్న చిన్నారులకు హైస్కూల్ స్థాయిలో ఇచ్చిన ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ భవిత కేంద్రాల్లో పిల్లల హాజరు పెంచాలన్నారు. మండలంలోని ప్రతి స్కూళ్లను సమన్వయం చేసుకుంటూ సర్వే చేయాలన్నారు. పిల్లలకు సంబంధించిన రికార్డులను అప్‌డేట్‌గా ఉంచాలన్నారు. హోం విజిట్స్ సక్రమంగా చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని 24 భవిత కేంద్రాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వేగుళ్లది ఆడలేక మద్దెల ఓడు



ఏడిదలో అభివృద్ధి పనుల శిలా ఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

- ప్రజలకు కనిపిస్తున్న అభివృద్ధి ఆయనకు ఎందుకు కనిపించడం లేదు
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం (మండపేట): నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుది ఆడలేక మద్దెల దరువు అన్నట్టుగా ఉందని, ప్రజలందరికీ కనిపిస్తున్న అభివృద్ధి ఎమ్మెల్యే కు కనిపించడంలేదని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎద్దేవా చేశారు. మండపేట మండలంలోని ఏడిదలో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదంలతో కలిసి ఎమ్మెల్సీ తోట పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. రూ.24 లక్షలతో పంచాయతీ భవనం సమీపంలోని నూతన భవనాన్ని, రూ.25.95 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 26.05 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్‌ను ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. సంకా వారి కాలనీలో రూ.16.59 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను, రూ.12 లక్షలతో నిర్మించిన బీసీ కమ్యూనిటీ హాల్, రూ.8.50 లక్షలతో రజకుల చెరువు ఫెన్సింగ్‌లను ప్రారంభించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నియోజకవర్గంలో విశేష అభివృద్ధి చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే హయాంలో చేయలేని అభివృద్ధి తాను చేసి చూపించానని, ఈ విషయం ప్రజలందరికీ బహిరంగంగానే తెలుస్తున్నా ఆయనకు కనిపించకపోవడం ఆడలేక మద్దెలదరువు అన్నట్టు విమర్శలకు పరిమితమవుతున్నారన్నారు. రాష్ట్రంలో అన్ని రంగాల్లో అభివృద్ధిని చేసి చూపించిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. నియోజకవర్గంలోని గ్రామాల్లో ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించే దిశగా ముందుకు సాగుతున్నానన్నారు. అభివృద్ధిపై ఎలాంటి చర్చకైనా తాను సిద్ధమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్న బాబు, జెడ్పీటీసీ కురుపూడి భవాని, ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాసు, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ రామిశెట్టి శ్రీహరి, ఎంపీటీసీ సభ్యులు తాతపూడి ఉషా, గ్రామ పార్టీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు కూరుపుడి రాంబాబు, తాతపూడి రాజేష్, పట్నాల నాగబాబు, చంద్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

మైనారిటీల అభ్యున్నతికి కృషి

- షాది ఖానా నిర్మాణానికి నిధులు
- ఎమ్మెల్సీ తోటను సత్కరించిన మైనారిటీ సోదరులు



మండపేటలో ఎమ్మెల్సీ తోటను సత్కరిస్తున్న మైనారిటీ నేతలు

కపిలేశ్వరపురం (మండపేట): మైనారిటీల అభ్యున్నతికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ రైతు బజార్ వద్ద షాదీఖాన నిర్మాణానికి మున్సిపల్ నిధులు రూ.40 లక్షలు నిధులు కేటాయింపునకు కృషి చేయడంపై పట్టణంలోని నాలుగు మసీదుల పరిధిలోని ముస్లింలు శుక్రవారం ఎమ్మెల్సీ తోటను తన క్యాంపు కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోటకు పూల కిరీటాన్ని అలంకరించి ఘనంగా సత్కరించారు. నిధుల మంజూరుకు సహకరించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణికి ముస్లింలు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న షాదీఖానా నిర్మాణానికి ముస్లిం సోదరులు ప్రయత్నిస్తున్నారని తెలిసి నిధులు మంజూరుకు కృషి చేశానన్నారు. మైనారిటీల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విశేష కృషి చేస్తున్నారన్నారు. తమ దీర్ఘకాలిక సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్సీ తోటకు కృతజ్ఞతలు తెలిపిన వారిలో మండపేట మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ రబ్బానీ, రాష్ట్ర షేక్ అండ్ షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అలీ ఖాన్‌బాబా, తదితర ముస్లింలు ఉన్నారు.

వైభవంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు: అప్పనపల్లిలో వీరభద్రస్వామి సంబరం సోమవారం వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం, బాణసంచా కాల్పులు, నృత్యాల నడుమ వైనతేయ గోదావరి నది వరకు స్వామిని ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అక్కడ నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం నది వద్ద తులా గోపాలకృష్ణ, నాగసూర్యావతి దంపతులతో పాటు కంకిపాటి హేమంత్‌నాగేంద్రకుమార్ ఆధ్వర్యంలో వీరభద్రస్వామి సంబరాన్ని ఘనంగా జరిపించారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితులు స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

ప్రజల సహకారంతో పట్టణాభివృద్ధి

కమిషనర్ రాము



పారిశుధ్య చర్యలపై మున్సిపల్ ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజల సహకారంతో మండపేట పట్టణాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని మున్సిపల్ కమిషనర్ బి.రాము తెలిపారు. డీఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లావణ్యలతో కలిసి పట్టణంలోని 15, 16 వార్డుల్లో పర్యటించారు. స్థానిక పరిస్థితులను నివాసితులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పారిశుధ్య మెరుగుకు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. దోమల నివారణ చర్యలను క్రమం తప్పకుండా చేపట్టాలని సిబ్బందికి సూచించినట్టు కమిషనర్ రాము తెలిపారు.

విశ్వేశ్వరాయపురంలో వైజ్ఞానిక ప్రదర్శన



విద్యార్థులు రూపొందించిన సైన్స్ పరికరాలను వీక్షిస్తున్న ఉపాధ్యాయులు

మలికిపురం: జన విజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండలంలోని విశ్వేశ్వరాయపురం వివేకానంద ఉన్నత పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విచ్చేసిన విద్యార్థులు రూపొందించిన వివిధ సైన్స్ నమూనాలు ఆకట్టుకున్నాయి. రైలు పట్టాలు దాటేటప్పుడు ప్రమాదాలు జరగకుండా ఉండేలా 8వ తరగతి విద్యార్థిని పీబీ సాధిక తయారు చేసిన రైల్వే రక్షణ ప్లాట్‌ఫాం నమూనా అందరినీ ఆకట్టుకుంది. లౌక్యశ్రీ,హన్సిక రూపొందించిన చంద్రయాన్–3 నమూనా అలాగే స్పీడ్‌బ్రేకర్ వద్ద విద్యుత్ ఉత్పత్తి, 7వ తరగతి విద్యార్థిని ఎ.గీతికాశ్రీ తయారు చేసి ప్రదర్శించిన ఆటోమేటిక్ సిలైన్ కంప్లీషన్ అలారం వంటి సుమారు 200 ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాన్ని విశ్వేశ్వరాయపురం సర్పంచ్ సీహెచ్ హెలీనా రిబ్బన్ కట్ చేసి ఎగ్జిబిషన్ ప్రారంభించగా, మండల విద్యాశాఖాధికారిణి ఎం.విజయశ్రీ, ఎంఈవో–2 వైవీ సత్యనారాయణ, జేవీవీ జెండా ఎగురవేసి జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ వేడుకలు ప్రారంభించారు. కార్యక్రమంలో జేవీవీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు ఈఆర్ సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పర్యావరణ కమిటీ అధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ నల్లి శివ, రోటరీ ప్రెసిడెంట్ యస్.మురళీకృష్ణ, తాడి సహదేవ్, ఎస్.రమేష్ బాబు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, కరెస్పాండెంట్ పీవీవీ వర ప్రసాద్ పాల్గొన్నారు.

కొబ్బరి వృక్ష మిత్రలు రైతులకు అండగా ఉండాలి



అంబాజీపేటలో కొబ్బరి వృక్ష మిత్రలకు ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న డిప్యూటీ డైరెక్టర్ కుమార్‌వేల్, అధిపతి చలపతిరావు

అంబాజీపేట: కోనసీమలో కొబ్బరి రైతులకు సమస్యగా మారిన దింపు కార్మికుల కొరతను అధిగమించేందుకు కొబ్బరి అభివృద్ధి బోర్డు (సీడీబీ) ద్వారా ప్రవేశపెట్టిన కొబ్బరి వృక్ష మిత్రలు రైతులకు అండగా ఉండేందుకు కృషి చేయాలని అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎస్‌బీవీ చలపతిరావు సూచించారు. స్థానిక పరిశోధన కేంద్రంలో గత ఆరు రోజులుగా జరుగుతున్న కొబ్బరి వృక్ష మిత్రల శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. చలపతిరావు మాట్లాడుతూ కోనసీమలోని యువకులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో భాగంగా కొబ్బరి చెట్టు ఎక్కే పరికరం ఉపయోగించి చెట్లు ఎక్కడంలో నైపుణ్యంపై పోటీలు నిర్వహించారు. బూడిద విజయ్, బూడిద సంజీవ కుమార్, బొక్కా శ్రీనివాసరావు (గంగలకుర్రు)లకు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు శిక్షణ ధ్రువీకరణ పత్రాలు, క్లైంబర్స్‌ను యువకులకు డాక్టర్ చలపతిరావు, సీడీబీ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎస్.కుమార్‌వేల్‌లు అందజేశారు. ఈ ముగింపు కార్యక్రమంలో తెగుళ్ల విభాగం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.గోవర్ధనరావు, శాస్త్రవేత్త బి.నీరజ, కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎ.అనూష, ఉద్యాన శాస్త్రవేత్త ఎ.కిరిటీ, ఏఈఓ పి.శశికళ, మాస్టర్ ట్రైనీలు పి.సోమశేఖర్‌బాబు, ఇ.వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠ పూజలు

మామిడికుదురు: పాశర్లపూడిలో శ్రీ, భూ సమేత చెన్న కేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ధ్వజ స్తంభ పునః ప్రతిష్ఠా మహోత్సవం పూజలు శనివారం ఘనంగా జరిగాయి. విఘ్నేశ్వర పూజ, విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, శాంతి హోమం తదితర పూజలను వైభవంగా జరిపించారు. ఆలయ ఈఓ ఎన్‌వీఎస్‌వీ ప్రసాదరాజు ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. పెదపట్నంలో వేంకటేశ్వరస్వామి ప్రతిరూపంగా భావించే ఆబోతుకు, లక్ష్మీదేవి స్వరూపమైన గోమాతకు కల్యాణం ఘనంగా జరిపించారు. ఆబోతుతో పాటు ఆవును చూడ చక్కగా అలంకరించి కల్యాణ క్రతువు జరిపించారు. ముత్యాల గణపతి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కల్యాణంలో పలువురు భక్తులు పాల్గొని ఆబోతు, ఆవు చుట్టూ ప్రదక్షిణ చేసి పూజలు నిర్వహించారు.

ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- కోరుమిల్లిలో గడప గడపకూ పర్యటన



కోరుమిల్లి గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మండలంలోని కోరుమిల్లి గ్రామంలో శనివారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, యువనేత తోట పృథ్వీరాజ్‌లకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి అందిన లబ్ధిని వివరించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ కోరుమిల్లి గ్రామం నాకు అభిమాన గ్రామమన్నారు. ఈ గ్రామానికి సేవ చేసుకునే అదృష్టం కలిగినందుకు ఆనందంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో గ్రామస్తులంతా తనను ఆదరించాలని కోరారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి కామేశ్వరరావులు గ్రామంలో సంక్షేమం అమలును వివరించారు. కార్యక్రమంలో మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి, మండపేట ఎంపీపీ ఉండమట్ల వాసు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ ఆచంట వీవీ స్వామి, మాజీ సర్పంచ్ సలాది వీరబాబు, మాజీ డీసీసీబీ డైరెక్టర్ సలాది అప్పారావు, పేరాబత్తుల రామకృష్ణ, సుంకర మూలాస్వామి, పేరాబత్తుల శివశంకర్, వింటి సత్తిబాబు, సుంకర చిన్న పాల్గొన్నారు.

కష్టాన్ని గుర్తించే పార్టీ వైఎస్సార్ సీపీ



వెదురుమూడిలో సింహాచలాన్ని సత్కరిస్తున్న గ్రామ ప్రజాప్రతినిధులు, ప్రముఖులు

కపిలేశ్వరపురం (మండపేట): ప్రజల్లో నిబద్ధతతో పని చేసే నాయకులు, కార్యకర్తలను గుర్తించే పార్టీగా వైఎస్సార్ సీపీ ముందుకు సాగుతుందని మండపేట మార్కెటింగ్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన నక్కా సింహాచలం సత్కార కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు అన్నారు. వెదురుమూడిలో శనివారం సింహాచలాన్ని ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. సర్పంచ్ చోడే రామతులసి, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు చోడే వెంకటేశ్వరరావు, చోడే సూర్యప్రసాద్, గజ్జరపు కల్యాణ్‌కుమార్ మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన వ్యక్తికి గౌరవం దక్కడం గర్వంగా ఉందన్నారు. దళిత నాయకుడైన సింహాచలంను కీలకమైన ఏఎంసీ చైర్మన్ పదవిలో నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. సింహాచలం మాట్లాడుతూ 35 ఏళ్లుగా రాజకీయ రంగంలో ప్రజలకు సేవ చేశానని, వైఎస్సార్ సీపీలో తనకు గుర్తింపు దక్కడంపై ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి వి.లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సూర్యప్రకాష్‌కు మద్దతుగా నిలవాలి



పామర్రు దళిత కాలనీలో పర్యటించి మద్దతు పలకాలని కోరుతున్న వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

కె.గంగవరం: రానున్న ఎన్నికల్లో రామచంద్రపురం ఇన్‌చార్జ్‌గా ఉన్న పిల్లి సూర్యప్రకాష్ విజయానికి మద్దతుగా దళితులంతా మద్దతుగా నిలవాలని దళిత నాయకులు పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, సచివాలయ కన్వీనర్ తోకల శ్రీను తదితరులు పిలుపునిచ్చారు. మండలంలోని పామర్రు, అముజూరు, పాణింగపల్లి, సత్యవాడ గ్రామాల్లోని దళిత కాలనీల్లో శనివారం వారు పర్యటించారు. వారు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగిందన్నారు. ముఖ్యంగా దళితులందరికీ ఎన్నో సంక్షేమ పథకాలు అందించారని దీంతో పాటు దళిత వాడల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు. గతంలో కన్నా ఈ ప్రభుత్వ హయాంలో దళితవాడలు అభివృద్ధి చెందాయన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు. వ్యవసాయ శాఖ సలహా మండలి జిల్లా సభ్యుడు బత్తుల అప్పారావు, కోటి వెంకట్రావు, కొప్పుల నాగన్న, పార్టీ జిల్లా కార్యదర్శి సాదే నారాయణరావు, సర్పంచ్ చిల్లే నాగేశ్వరరావు, కొండేపూడి నూకరాజు, మల్లిడి వెంకట్రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

తల్లి, కుమారుడు అదృశ్యంపై కేసు నమోదు



సతీమణి(ఫైల్)



కోటిలింగేశ్వరరెడ్డి(ఫైల్)

రాయవరం: స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో తల్లి, కుమారుడు అదృశ్యమైన ఘటనపై ఎస్సై జి.నరేష్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సోమేశ్వరం గ్రామానికి చెందిన ద్వారంపూడి సతీమణి, కుమారుడు కోటి లింగేశ్వరరెడ్డితో కలిసి నివశిస్తున్నారు. సతీమణి భర్త వీరవెంకట సత్యనారాయణరెడ్డి రెండేళ్ల క్రితం కరోనా సమయంలో మృతి చెందాడు. సతీమణి, ఆమె కుమారుడు ఈ నెల 23న అదృశ్యం కావడంపై సతీమణి సోదరుడు కొవ్వూరి వెంకటనారాయణరెడ్డి ఫిర్యాదు చేశారు. కోటి లింగేశ్వరరెడ్డి సుమారు రూ.25లక్షల వరకు అప్పుడు చేశాడని, అప్పుల బాధ భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్టుగా సూసైడ్ నోట్‌ను ఇంటి వద్ద ఉంచి తల్లితో పాటు అదృశ్యమైనట్టుగా ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు. తల్లి, కుమారుడు అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నరేష్ తెలిపారు.

ఘనంగా కోదండరాముని విగ్రహ ప్రతిష్ఠ



వెల్ల కోదండ రామాలయం వద్ద విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శాంతి కల్యాణం

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల పెద్ద శెట్టిబలిజపేటలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో సీతారామలక్ష్మణులు, వినాయక, సరస్వతి, హనుమాన్‌ల విగ్రహాల పునః ప్రతిష్ఠ కార్యక్రమం గణపతి శాస్త్రి బ్రహ్మత్వంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పుత్రకామేష్టి హోమం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, నీరాజన మంత్రపుష్పాలు, చతుర్వేద స్వస్తి, దర్బారు సేవ, శాంతి కల్యాణం, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ కమిటీ పెద్దలు మేడిశెట్టి సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీనివాస్, గుత్తుల రాంబాబు, చొల్లంగి యేసు, కాదా గోవిందుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీపీ అంబటి భవాని, సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీలు చిక్కాల స్వామికాపు, మంచం దేవి, నాయకులు చిక్కాల దొరబాబు, నరాల ఏడుకొండలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.